క్లుప్తంగా

ఈవీఎంలను భద్రపరచిన అధికారులు



గురజాల : ఎన్నికల వేళ సమీపిస్తుండడంతో అధికారులు ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈనెల 18న ఎన్నికల విధుల్లో మొదటి అడుగు పడనుంది. 18నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధికారులు భద్రపరిచారు. నియోజక వర్గంలో ఉన్న 304 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఈవీఎంలు గురజాలకు చేరుకున్నాయి. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాచర్ల : పట్టణంలో రెండో శనివారం విద్యుత్ లైనుల మరమ్మత్తుల్లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎఈ హరిబాబు, డీఈ ఎ.రామయ్యలు విద్యుత్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. మాచర్ల పట్టణం, రూరల్, జమ్మలమడక, దుర్గి, వెల్దుర్తి, పలు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా నిలిపి మరమ్మత్తు పనులు జరిపారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా అందించారు.

నాగుల గుడి దేవస్థానంలో సరస్వతి దేవిగా అమ్మవారు



పిడుగురాళ్ల : పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. వసంత నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

బాధితులకు మూడు సెల్‌ఫోన్లు అందచేత



రెంటచింతల : మండలంలోని వివిధ గ్రామాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితులకు వాటిని అందచేసినట్లు ఎస్‌ఐ కె. వెంకట నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వెంటనే సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్లను ట్రాక్ చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వెంటనే వారి వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా త్వరగా కనుక్కోవచ్చన్నారు. పోగొట్టుకున్న తమ సెల్‌ఫోన్ల త్వరగా ట్రేస్‌చేసి అందచేసిన ఎస్‌ఐ నారాయణరెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు 31వ వార్డులో ఎన్నికల ప్రచారం

మాచర్ల : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 నుంచి 31వ వార్డులో పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి చేసిన మేలు గురించి వివరించే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కోరారు.

భక్తి శ్రద్ధలతో స్వామివారికి బోనాల సమర్పణ



రెంటచింతల : స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు 16 రోజుల పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో శనివారం బోనాలను సమర్పించారు. మార్చి 28న స్వామివారి దేవస్థానం 20వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్వామివారి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. దేవస్థానం అధ్యక్షులు నాశం పెద్దబాబు, దేవస్థానం పాలక వర్గం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల వేళ నిఘా కట్టుదిట్టం

- సరిహద్దు చెక్‌పోస్టుల్లో డేగ కళ్లతో భద్రత
- ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు
- 507 లీటర్లు మద్యం, 195 లీటర్లు బీర్ స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు



పొందుగుల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు, సెబ్ అధికారులు

గురజాల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసులు, సెబ్ అధికారులు డేగ కళ్లతో నిఘా వేశారు. తెలంగాణా నుంచి మద్యం, నగద , గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు ఏపీలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దాచేపల్లి మండలంలోని పొందుగుల వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుతో పాటు కృష్ణానది తీర ప్రాంతమైన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని అపి సాయుధ పోలీసు బలగాలు సోదాలు నిర్వహిస్తున్నారు. ద్విచక్రవాహనాలనె సైతం తనిఖీ చేస్తున్నారు. ప్రధానంగా డబ్బు, మద్యం, తరలి రాకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో సాయుధ బలగాలు, సెబ్ అధికారులు ఇతర శాఖలకు చెందిన అధికారులు చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అటు తెలంగాణా, ఇటు ఆంధ్రా పోలీస్ అధికారుల సమన్వయంతో చెక్ పోస్టుల వద్ద పహారా కాస్తున్నారు. 24 గంటలపాటు వాహనాలను తనిఖీ చేస్తూ అసాంఘీక కార్యాకలాపాలను నిరోధిస్తున్నారు. హైదరాబాద్ జాతీయ రహదారిపై వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ బస్సులు లారీలు, కార్లు, ద్విచక్రవాహనాలు , సరుకు రావాణా వాహనాలు ఇలా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే వదులుతున్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరు రాష్ట్రాల సెబ్, ఇతర శాఖ అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ చెక్‌పోస్టులను పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గంలో నాలుగు చెక్‌పోస్టులు : నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలో దాచేపల్లి మండలంలో పొందుగుల, తంగెడ, మాచవరం మండలంలో గోవిందాపురం (బల్లకట్టు), రేగుల గడ్డ వద్ద సెబ్ అధికారులు, పోలీసులు ఇతర శాఖల అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల సెబ్ పరిధిలో మాచవరం, గురజాల సెబ్ పరిధిలో దాచేపల్లి చెక్‌పోస్టులు ఉన్నాయి. పిడుగురాళ్ల, గురజాల సెబ్ అధికారులు చేపట్టిన దాడుల్లో జనవరి 1వ తేది నుంచి నేటి వరకు 203 కేసులు నమోదు చేయగా వాటిలో 507 లీటర్లు తెలంగాణా మద్యం, 195 లీటర్లు తెలంగాణా బీర్లు, 5139 లీటర్లు బెల్లం ఊటను స్వాధీనం చేసినట్లు ఆయా శాఖ అధికారులు వెల్లడించారు. ఈ కేసుల్లో 9 వెహికల్‌లను అదుపులోకి తీసుకోగా 386 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఎన్నికల కోడ్‌ను దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి. కోడ్ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా తప్పు చేస్తే చర్యలు తప్పవు. తెలంగాణా రాష్ట్రం నుంచి ఏపీకి మద్యం, డబ్బు వంటివి తీసుకు వస్తే వాటిని సీజ్ చేయడం జరుగుతుంది. అక్రమంగా రవాణా చేసిన సహించేది లేదు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రతి వాహనంను చెక్ చేస్తున్నాం. వాహనదారులు పోలీస్, సెబ్ సిబ్బందికి సహకరించాలి.

– వెంకట రమణ, సెబ్ సీఐ, గురజాల

నగదు, మద్యం అక్రమ రవాణాపై దృష్టి



ఎన్నికల నిబంధనల మేరకు చెక్ పోస్టుల్లో నగదు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. పొందుగుల, తంగెడతో పాటు పలు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటలు చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టేలా చర్యలు చేపట్టాం. ఎటువంటి పరిస్థితుల్లో నగదు, మద్యం అక్రమ రవాణా జరిగే ప్రసక్తి లేదు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.

– పల్లపురాజు, డీఎస్పీ , గురజాల

మైనార్టీల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పార్టీలో చేరిన మైనార్టీలతో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల : మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా పట్టణంలోని 28వ వార్డులో ఖాశిం ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు చెందిన వారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారందరినీ ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై ఉందన్నారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు ఏడు ఎమ్మెల్యే సీట్లు కేటాయించారన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరో రూ. 3 కోట్ల ముస్లిం సామాజిక వర్గానికి తాను నిధులు కేటాయించి, మసీదులు, మదర్సాల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, కౌన్సిలర్ షేక్ మస్తాన్, కో ఆప్షన్ సభ్యుడు అంగార్‌బాషా, దరియా, నాగూల్, జానీ, అల్లాబక్షు, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

18 మంది వలంటీర్లు రాజీనామా



పిడుగురాళ్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థను ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకొని చంద్రబాబు నాయుడు, నిమ్మగడ్డ రమేష్ పెట్టిన పిటీషన్లకు వాలంటీర్ సేవలకు ఆటంకం కలగటంతో పిడుగురాళ్ల పట్టణంలోని పలు సచివాలయ పరిధిలోని వాలంటీర్లు శనివారం సచివాలయ అడ్మిన్‌కు అందజేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని, మళ్లీ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందు,కు తాము చేయాల్సిన విధులు నిర్వర్తించేందుకు వాలంటీర్లు నడుం బిగించారు. అందుకే పట్టణంలోని 13 వార్డులోని 8వ సచివాలయ పరిధిలో ఆరుగురు వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో కరిముల్లా, చింతమళ్ల కోటేశ్వరరావు, బొగ్గవరపు బాలకాశీ, గంజనబోయిన నాగలక్ష్మీ, సిద్దాల మేరిసికుమారి, షేక్ సుభానీ సచివాలయ అడ్మిన్‌కు రాజీనామా లెటర్‌లను అందజేశారు. అలాగే 6వ సచివాలయ పరిధిలోని 9వ వార్డులోని 9 మంది వాలంటీర్లు పాలిశెట్టి ఉదయ్‌కుమార్, గుమ్మడిదల మానస, శీలం నాగజ్యోతి, కంద్రాతి నాగమల్లిక, కందుకూరి వలియరాణి, తిమట శిరిష్, ఓరుగంటి కనకమహాలక్ష్మీ, చల్లా కృష్ణలు రాజీనామా చేశారు. 16వ వార్డుకు చెందిన ముగ్గురు వాలంటీర్లు పోతురాజు మణికుమార్‌గౌడ్, ప్రసన్న, రంజాన్‌బిలు మొత్తం 18 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత చావా అనిల్ చౌదరి



టీడీపీ నేత చావా అనిల్ చౌదరిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిఆర్కే

దుర్గి : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ మద్దతుగా నిలిచి రెండోసారి సీఎంగా గెలిపించుకోవాలని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అడిగొప్పల గ్రామానికి చెందిన టీడిపి సీనియర్ నేత చావా అనిల్ చౌదరిని ప్రభుత్వ విప్ పిఆర్కే పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడిపి నేత చావా అనిల్ చౌదరి మాట్లాడుతూ టీడిపి స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పార్టీని నమ్ముకున్న తమ లాంటి వారిని నిర్లక్ష్యం వహించి కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని విమర్శించారు. పార్టీలో చేరిన అనిల్‌ను సర్పంచ్ నల్లబోతు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాయలమధుబాబు, నాగెండ్ల లక్ష్మీనారాయణ, తోట మల్లిఖార్జున, తాళ్ళ అంబారావు, తోట వాసు పలువురు అభినందించారు.

ప్రజలకు మేలు చేయడమే మా అజెండా

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



గజమాలతో ప్రభుత్వ పిఆర్కేను సత్కరిస్తున్న దృశ్యం

దుర్గి : ప్రజలకు మేలు చేయటమే లక్ష్యంగా ఐదు సంవత్సరాల కాలంలో పనిచేశానని, కులాలకు, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందచేసినట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోలగుట్ల, లక్ష్మిపురం తండాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. ముందుగా లక్ష్మీపురం తండాలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పిటీసీ శెట్టిపల్లి యలమంద, వైస్ ఎంపీపీలు ఊరిబండి యేగయ్య, చల్లా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ ఉన్నం పెద్ద బ్బాయ్, యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, యార్డు డైరెక్టర్లు కపలవాయి సూర్యనారాయణ, చింతా నరసింహారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మద్దికర ఆదిరెడ్డి, కటకం చిన వెంకటయ్య, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, ఊరిబండి మన్నయ్య, సర్పంచ్ మద్దికర శ్రీనివాసరెడ్డి, జంగా కొండలు, ఎంపీటీసీ నక్కా ఆదినారాయణ, మద్దికర వెంకటరెడ్డి, వైస్ సర్పంచ్ మమ్ము శ్రీనివాస్, నలబోలు మంగారావు, పొన్నూరి నికో, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పలువురు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

– ఎస్‌ఐ నారాయణరెడ్డి

తుమ్మకోట (రెంటచింతల): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, గ్రామాల్లో స్వేచ్ఛగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచివ్యక్తిని చట్టసభలకు పంపించాలని ఎస్‌ఐ కైపు వెంకట నారాయణరెడ్డి కోరారు. శనివారం మండలంలోని తుమ్మకోట గ్రామంలో గ్రామస్తులకు ఏర్పాటు చేసిన ఓటు హక్కుపై అవగాహనా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో పలు వివాదాల్లో ఉన్న వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను భయందోళనకు గురిచేసినా, ఓటు హక్కుకు భంగం కలిగించినా, మద్యం, నగదు, విలువైన వస్తువులతో ఓటర్లను మభ్యపెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యక్తి తన మనసాక్షి ప్రకారం ఓటును వినియోగించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలో దళితులకు అత్యున్నత గౌరవం

- మాచర్లలో పీఆర్కేని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం
- మాచర్ల నియోజకవర్గ దళిత నాయకులు



మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

కారెంపూడి : స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా దళితులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని మాచర్ల నియోజకవర్గంలోని దళిత ప్రజా ప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెంటచింతల ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దళితులను సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటూ పుట్టింటినే మరచిపోయేంత ప్రేమతో ఉన్నత స్థానం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ మాట్లాడుతూ పీఆర్కే విజయానికి దళితులను చైతన్యవంతం చేసేందుకు అన్ని గ్రామాలలో పర్యటిస్తున్నామన్నారు. ఈసారి ఎన్నికల్లో దళితుల ఐక్యత ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. దళిత నాయకులు కారెంపూడి ఎంపీటీసీ అంతరగడ్డ ఏసోబు, అచ్యుతరావు, లంకా నాగేశ్వరావు, కడియం వెంకటరావు, మండల పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, రమావతు తేజానాయక్, బొంకూరి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

ఇంటర్ ఒకేషనల్ కోర్సులో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కళాశాల డైరెక్టర్‌లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

మాచర్ల : పట్టణంలోని ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు ఫలితాల్లో ఆదిత్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.అశోక్, వై.వెంకట్రామయ్య తెలిపారు. ఇంటర్ ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో మేనేజ్‌మెంట్, ఎల్‌ఎండీ కోర్సుల్లో పల్నాడు జిల్లా స్థాయిలో 575 మార్కులతో రూత్ కేర్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఎల్‌ఎండీ కోర్సులో జె.భువనశ్రీ 468 మార్కులు, పి.నాని 449 మార్కులు, ఇతర కోర్సుల్లో వాడపల్లి స్వాతి 440 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు సూరేకొండలు, సీతయ్య, నక్కా లక్ష్మయ్య,అ ధ్యాపకులు, తదితరులు అభినందించారు.

నిశ్చితార్థానికి రమ్మని టీడీపీ కండువాలు కప్పారు

బుడగ జంగాల నేతలు



రెండు రోజుల క్రితం టీడీపీ కార్యాలయంలో కండువాలు కప్పిన యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల : ఇంట్లో కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమం ఉందని, మీరంతా వచ్చి భోజనం చేసి వెళ్లాలని బుడగ జంగాల నాయకులను టీడీపీ నాయకుడు కంపా బాలశౌరి పిలవడంతో లోకజ్ఞానం తెలియని వారు ఇది నిజమని నమ్మారు. ఈ లోగా 12వ వార్డుకు చెందిన టీడీపీ ఇన్‌ఛార్జి మొగలి ఏడుకొండలు కూడా ఈ బుడగ జంగాల నాయకులతో కలిసి వారిచేత ఫుల్‌గా మద్యం తాగించి, రూ. 2 వేల నగదును అందజేసి భోజనానికి వెళదామని నమ్మబలికి పక్కనే ఉన్న టీడీపీ కార్యాలయానికి తీసుకు వెళ్లారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు చేత వారి మెడలో టీడీపీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారని ప్రచారం చేయించుకున్నారు. తెల్లారి విషయం తెలుసుకున్న బుడగ జంగాల నాయకులు షాక్‌కు గురయ్యారు. బుడగ జంగాల నేతలు గంజాయి మస్తాన్, గంజాయి తిరుపతయ్య, గంజాయి పొట్టి లింగయ్య, తిరవాటి సతీష్, పెళ్లూరు మహేష్ బుడగ జంగాల కుటుంబ సభ్యులందరితో కలిసి శనివారం 12వ వార్డులోని కాసు బ్రహ్మానందరెడ్డి కాలనీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బుడగ జంగాల కుల ధృవీకరణ పత్రాన్ని ముఖ్యమంత్రి అందించడంతో పాటు ప్రతి కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించారన్నారు, ప్రతి ఇంటికి మంచినీటిని ఇచ్చేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారని, అందరికి రేషన్ కార్డులు అందించారని తెలిపారు. అలాంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి మేము టీడీపీలోకి చేరడమంటే మా ప్రాణాలు ఉడికినట్లేనన్నారు. తమకు శుభకార్యమని చెప్పి ఆహ్వానించి, మద్యం సేవింపజేసి, రూ. 2 వేలు నగదు ఇచ్చి మద్యం మత్తుల్లో టీడీపీ కార్యాలయంలో జెండాలు కప్పించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 12వ వార్డు కౌన్సిలర్ కాంత్రగుంట శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్, పట్టణ ఎస్టీ సెల్ కన్వీనర్ కాంత్రగుంట కన్నయ్యతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, బుడగ జంగాల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



మాయమాటలు చెప్పి టీడీపీ కండువాలు కప్పారని తెలుపుతున్న బుడగ జంగాల నాయకులు

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి

తహసీల్దార్ రామ్ మోహన్‌రావు



మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్‌మోహన్‌రావు

రెంటచింతల : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తహసీల్దార్ ఎస్.రామ్ మోహన్‌రావు అన్నారు. శనివారం సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను, సత్రశాల వద్దనున్న అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు గతంలో జరిగిన ఎన్నికల సమయంలో ఏఏ పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయో ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో నున్న 11 గ్రామాలలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు సహకరించాలన్నారు. తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం, నగదు, విలువైన వస్తువులు సరఫరా నిలుపుదల చేయుటకు సత్రశాల వద్ద అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దాసరి కాంతారావు, విఆర్వో కటికల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు ట్యాంకర్లతో మంచినీటి సరఫరా



మంచినీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్ నుంచి మంచినీటిని పట్టుకుంటున్న గోలి గ్రామస్తులు

రెంటచింతల : మండలంలోని గోలి, జెట్టిపాలెం, మల్లవరం గ్రామాలకు సత్రశాల పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం సహకారంతో ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు ప్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, సీజీఎం జి.ధర్మారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఆయా గ్రామస్తులు మంచినీటి సమస్య కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నందున సత్రశాల పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చి మూడు గ్రామాలకు రెండు ట్యాంకర్ల సహాయంతో మంచినీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్యాక్టరీ యాజమాన్యం ఆయా గ్రామాలలో పిల్లల విద్యాభివృద్ధికి చేయుతనివ్వడంతో పాటు పలు సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలను అందిస్తోందని చెప్పారు.

ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్లలో చైతన్యం

నోడల్ ఆఫీసర్ పెదప్రోలు శంకర్‌రావు



రెంటచింతలలో ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్లలో చైతన్యం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

రెంటచింతల : గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవడానికి ఎన్నికల సంఘం ఓ ప్రత్యేక వాహనం ద్వారా చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు నోడల్ ఆఫీసర్ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శనివారం రెంటచింతలలోని పలు కాలనీల్లోఆయన ప్రత్యేక వాహనం ద్వారా ఓటర్ల చైతన్య కార్యక్రమాల్లోపాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక వాహనం ద్వారా అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని గ్రామాలలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శి నాగులునాయక్, విఆర్వోలు టి. లింగయ్య, రేఖా, నాసరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 26 కుటుంబాలు చేరిక



టీడీపీ, జనసేన పార్టీల నుంచి ఎమ్మెల్యే కాసు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలు

దాచేపల్లి : మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు భారీ షాక్ తగిలింది. ఆరెండు పార్టీల పట్ల తీవ్ర అసంతృప్తితో ఆపార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో 25 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ, జనసేన నాయకులు కె.పూర్ణచంద్రరావు, కడియాల రామలింగయ్య, ఎస్.శివకృష్ణ, ఎస్.నాగార్జున, ఎం .వెంకటేశ్వర్లు, జి.అప్పారావు, జి.రమేష్, కొత్తపల్లి రమేష్, కొత్తపల్లి వీరబ్రహ్మం, వి.నరసయ్య, వి.దావీదు, వి. చినదావీదులకు ఎమ్మెల్యే కాసు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరామన్నారు. ఎమ్మెల్యే కాసు గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.నరసింహారావు, గ్రామ కన్వీనర్ నరసింహారావు, నాయకులు పి.నరసింహారావు, గూడూరి గోవర్ధన్‌రావు, రాచకొండ కోటయ్య, పాశం గురవయ్య, పాశం వీరయ్య, జి.వీరాస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.